క్లుప్తంగా

సీఐగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



రఘునాథపల్లి : జనగామ రూరల్ సీఐగా ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఆర్.సంతోష్ వరంగల్ కమాండ్ కంట్రోల్‌కు బదిలీ కాగా వరంగల్ ఐటీ సెల్‌లో పని చేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డికి ఎస్సై చాగర్ల రఘుపతి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైగా మహేందర్..



జఫర్‌గఢ్ : స్థానిక ఎస్సైగా ఎం.మహేందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన శంకర్ నాయక్ నుంచి ఎస్సై మహేందర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్సైగా శ్రావణ్..

దేవరుప్పుల : స్థానిక ఎస్సైగా కె.శ్రావణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతనం ఆయన మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే ప్రజలు తనను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్సైకి సన్మానం



బచ్చన్నపేట : ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కె.సతీష్ కుమార్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు నద్ది సోమిరెడ్డి ఆధ్వర్యంలో పూలబొకే అందించి శాలువాలతో శుక్రవారం సన్మానించారు. తొలుత ఆ పార్టీ నాయకులు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు గద్ద రాజు, బంగారు మహేష్, చిమ్ముల నరేందర్‌రెడ్డి, పెండెం నగేష్ పలువురు పాల్గొన్నారు.

సెకండ్ ఎస్సైగా లింగారెడ్డి



పాలకుర్తి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెకండ్ ఎస్సైగా ఎం.లింగారెడ్డి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మహబూబాబాద్‌లో పని చేస్తున్న క్రమంలో ఆయన్ను మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

వాహనాల తనిఖీ



నర్మెట : మండల కేంద్రంలో ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పలువురు వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. వాహనదార్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని సూచించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది రమేష్, రహమత్ అలీ, రాజు, ధనుంజయ్, వినోద్ పాల్గొన్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల పక్కన సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఫకీర్ (45) గురువారం ఫిట్స్‌తో మృతి చెందాడు. ఎస్సై వినయ్‌కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఫకీర్ రెండ్రోజులుగా మతిస్థిమితం లేక రోడ్డుపై తిరుగుతున్నాడు. గురువారం రాత్రి నీరున్న పొలంలోకి వెళ్లాక ఫిట్స్ రావడంతో మృతి ఫకీర్ మృతి చెందాడు. అతని వద్ద లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె, దూడ..

దేవరుప్పుల : మండల కేంద్రానికి చెందిన రైతు నీలారపు వేణుయాదవ్‌కు చెందిన పాడి గేదె, దూడ మేత మేస్తుండగా తెగిపడిన విద్యుత్ వైర్లకు తగిలి అక్కడిక్కడే మృతి చెందాయి. వాటి విలువల సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని రైతు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

పరామర్శ

చిల్పూరు : మండలంలోని దేవోజీతండాకు చెందిన దస్రు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజయ్య శుక్రవారం పరామర్శించారు. లింగంపల్లికి చెందిన శ్రీరాముల బాలమ్మ మృతి చెందగా ఆ కుటుంబాన్ని సర్పంచ్ ఏదునూరి రవీందర్ పరామర్శించి రూ.2 వేల సాయం అందజేశారు.

నివాళి

పాలకుర్తి : మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో చారుమజుందార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి భుజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జీడి సోమయ్య, మామిండ్ల శోభన్ రాజ్, తూర్పాటి సారయ్య పాల్గొన్నారు.



జనగామ : హైదరాబాద్ రోడ్డుపై వరద ఉధృతి



నీటిలోనే దర్శనమిస్తున్న దుకాణాలు

జలంలోనే ‘జనగామ’

జనగామ : ఈనెల 26, 27 తేదీల్లో కురిసిన భారీ వర్షాలతో జనగామ పట్టణంలో వరద ఉధృతి కొనసాగుతోంది. రంగప్పచెరువు మత్తడి వరదతోపాటు కుర్మ వాడ మీదుగా వస్తున్న నీటితో హైదరాబాద్ రోడ్డు జలమయమైయింది. శ్రీనగర్‌కాలనీ, బీరప్ప గడ్డ, బాలాజీనగర్, జ్యోతిగనర్ కాలనీల్లో అపరిశుభ్రత తాండవిస్తుండగా పలు కాలనీల్లోని మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. హైదరాబాద్ ప్రధాన రహదారిపై వరద తగ్గినా దుకాణాల ఎదుట భారీగా నీరు నిలవడంతో వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు. డ్రైనేజీల్లో సిల్ట్ నిండిపోవడం, సకాలంలో దాన్ని తొలగించకపోవడంతో వరద నీరు రోడ్లపైకి చేరుతున్న దుస్థితి నెలకొంది. రైల్వే అండర్ బ్రిడ్జి నీట మునగడంతో ఆ దారి నుంచి పాతబీటు బజార్ వైపునకు వచ్చే ప్రజలు, వాహనదార్లు ఫ్లైఓవర్ మీదుగా తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలోని అన్ని డ్రైనేజీల్లోనూ పేరుకుపోయిన సిల్ట్‌ను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ రజితను జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు.



వరదలో జ్యోతినగర్ కాలనీ ప్రధాన రహదారి



కుర్మవాడలో వరద



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద



వరదలో నడుస్తూ బాలాజీనగర్ నుంచి వెళ్తున్న కాలనీవాసులు

ప్రజాసంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నియోజకవర్గ కేంద్రంలోని రిజర్వాయర్‌ను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం సాయంత్రం సందర్శించారు. రిజర్వాయర్‌లో పూలు చల్లి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా చొరవ తీసుకుని రిజర్వాయర్ నిర్మింపజేసినట్టు తెలిపారు. ఏడు రిజర్వాయర్లతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మరో కోనసీమను తలపిస్తోందని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, చిల్పూరు ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు కుమార్, తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ ఘన్‌పూర్ : రిజర్వాయర్ మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

తెగిన రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు

చిల్పూరు : వర్షాలకు తెగిన రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయిస్తామని ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. మండలంలోని మల్లన్నగండి, పల్లగుట్ట చెరువుల్లో ఆయన పూజలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో చిల్పూరు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌రావు, ఎంపీపీ సరిత బాలరాజు, సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

జనగామ రూరల్/రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్/కొడకండ్ల/దేవరుప్పుల : సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని జీపీ ఉద్యోగ కార్మికుల జేఏసీ చైర్మన్ రాపర్తి రాజు, జిల్లా కన్వీనర్ మల్లేషం స్పష్టం చేశారు. జనగామలో చేపట్టిన సమ్మెలో శుక్రవారం వారు మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వచ్చిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులుకు వినతిపత్రం అందించారు. రఘునాథపల్లిలో జీపీ ఉద్యోగులు, కార్మికులు గాడిదకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల మండల కేంద్రాల్లో జీపీ కార్మికులు పచ్చిగడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దేవరుప్పులలో కార్మికులు దున్నపోతుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు.



జనగామ రూరల్: బీవీ.రాఘవులుతో నాయకులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్

జఫర్‌గఢ్ : భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత కుటుంబాలను సత్వరమే ఆదరకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో ఇండ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం పరామర్శించింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వందలాది ఇళ్లు కూలిపోయాయని తెలిపారు. బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. ఇళ్లు కూలిన వారికి కట్టించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, కోరుకొప్పుల నగేష్‌గౌడ్, గాదెపాక శ్రీను, పల్లె సంతోష్‌రెడ్డి, కొంద్ర శ్రీహరి, నరేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని పరామర్శిస్తున్న మాదాసు వెంకటేష్

రాజ్యాంగమే బీఎస్పీ మేనిఫెస్టో

● ప్రత్యేక ఎన్నికల ఇన్‌చార్జ్ వేముల కృష్ణ

జనగామ రూరల్: భారత రాజ్యాంగమే బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో అని బీఎస్పీ ఐదు అసెంబ్లీల ప్రత్యేక ఎన్నికల ఇన్‌చార్జ్ వేముల కృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జేరుపోతుల కుమార్ అధ్యక్షతన జరిగిన జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ కల్పించిన హక్కుల వల్లే నేడు ప్రజలు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నారని, మహిళలకు రక్షణ కల్పించి కార్మికుల హక్కులను వివరించాల్సి అవసరం కార్యకర్తలపై ఉందన్నారు. నాయకులు చంద్రశేఖర్, ఇరుగు మహేందర్, నాగులపల్లి అశోక్, జిలుక రవికుమార్, అకారపు దేవయ్య, రొమ్ము రాజు, నీలాద్రి, ఇసాక్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేముల కృష్ణ

సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి

● టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

జనగామ: కాంట్రిబ్యూషనరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్ర శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకోగా.. జెడ్పీ ఉంచి ఆర్టీసీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పాతపెన్షన్‌ను పునరుద్ధరించే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. యాత్ర ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో ముగుస్తుందని, వచ్చే నెల 12న 2లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో ×చలో హైదరాబాద్‌× కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.లింగమూర్తి ప్రసంగించా.. టీజీఓ అధ్యక్షుడు ఎండీ.అమ్జద్‌అలీ, ప్రధాన కార్యదర్శి కొర్నేలియస్, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి యాత్రకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గిన్నారపు బుచ్చన్న, శ్రీధర్, రాజేష్, బాలుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



:యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సీఎం కేసీఆర్‌తోనే పల్లెల్లో అభివృద్ధి

నర్మెట : సీఎం కేసీఆర్ చొరవ వల్లే పల్లెల్లో అభివృద్ధి జరుగుతోందని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలవి మాటలు తప్ప చేతలు కావని వారు వ్యాఖ్యానించారు. ఐటీడీఏ నుంచి మంజూరైన రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన డీసీ తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు గురువారం వారు భూమి పూజ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ వెనుకబడ్డ గిరిజనుల అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య శ్రీను నాయక్, తహసీల్దార్ పార్వంది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామిని శివరాజు, సర్పంచ్‌లు బానోత్ శంకర్‌నాయక్, జ్వాల శ్వేత కిషన్, ఉపసర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ గోవర్ధన్

స్వీపర్ల సమ్మెకు ఉపాధ్యాయుల మద్దతు

జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం వద్ద స్వీపర్లు చేపట్టిన సమ్మెకు ఉపాధ్యాయులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య మాట్లాడారు. స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. స్వీపర్లు కనీస వేతనాలు అందక, సర్వీస్ రెగ్యూలరైజేషన్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్వీపర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అయోధ్య, లాలు నాయక్, భాస్కర్, రాములు, యాదయ్య, రాంనర్సయ్య, భద్రయ్య, ఎల్లమ్మ పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు

చీటకోడూర్ కల్వర్టుకు దెబ్బ

● 10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

జనగామ రూరల్ : భారీ వర్షాలకు మండలంలోని చీటకోడూర్ గ్రామంలోని వాగు కల్వర్టుకు పగుళ్లు ఏర్పడి సైడ్ రోడ్డు దెబ్బతిన్నది. దీంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో దెబ్బతిన్న కల్వర్టుకు, రోడ్డుకు మరమ్మతులు చేయగా ప్రస్తుత భారీ వర్షానికి మళ్లీ రోడ్డుకు పగుళ్లు వచ్చాయి. గ్రామం నుంచి చౌడారం, మరిగడి పరిసరాల్లో 4 తండాలు, మండెలగూడెం, మాదారం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు సైతం ఈ దారి మీదుగానే వెళ్లాల్సి ఉంది. వర్షాలు కురిసిన ప్రతిసారీ ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి బ్రిడ్జి నిర్మింపజేయాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతింటున్న చీటకోడూర్ వాగు కల్వర్టు

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

చిల్పూరు : ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని లింగంపల్లి సర్పంచ్ ఏదునూరి రవీందర్ ప్రజలకు స్పష్టం చేశారు. మండలంలోని ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో మల్కాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరాలు, ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఏఎన్‌ఎంలకు, ఆశవర్కర్లకు తెలియజేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు బాణాల రాజమౌళి మాట్లాడారు. వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అనంతరం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంకటి రాజన్న, హెచ్‌ఈఓ బుచ్చిరెడ్డి, ఏఎన్‌ఎం మంజుల, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్ : స్థానిక కాంగ్రెస్ పార్టీ ఎల్‌డీఎం వెస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ తన కూతురు వర్షిణి జన్మదినం సందర్భంగా ఆమె చేతుల మీదుగా రైల్వేస్టేషన్ వద్ద అనాథలకు, వృద్ధులకు శుక్రవారం భోజన ప్యాకెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జన్మదిన, ఇతర వేడుకల సందర్భంగా అనాథలకు, వృద్ధులకు భోజనం అందించడాన్ని బాధ్యతగా భావించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొలిపాక ఈశ్వర్‌ప్రసాద్, మామిండ్ల శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న కొలిపాక సతీష్, వర్షిణి

గంగమ్మతల్లికి శాంతి పూజలు

పాలకుర్తి టౌన్ : భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని బమ్మెర గ్రామంలోని చెరువు వద్ద సర్పంచ్ జలగం నాగభూషణం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి శాంతి పూజలు నిర్వహించారు. తొలుత గ్రామంలో పసుపు, కుంకుమలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువు కట్ట ఎల్లమ్మ, గండి మైసమ్మ, కట్ట మైసమ్మ, కట్ట మైసమ్మలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, నాయకులు రాపాక సత్యనారాయణ, బత్తిని పరశురాములు, బత్తిని సురేష్, వంగాల అశోక్, కొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న సర్పంచ్, తదితరులు

ఎమ్మెల్యే స్పందించకపోవడం సిగ్గుచేటు

● వరద నీటిలో అర్ధనగ్న నిరసన ప్రదర్శన

జనగామ : భారీ వర్షాలకు రైతులు, ప్రజలు నష్టపోయినా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ చింతకింది మల్లేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నిలిచిన వరదనీటిలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, మల్లేష్ మాట్లాడారు. ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే జిల్లా కేంద్రంలో వరద నీరు నిలిచి వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శాస్త్రీయత లేని డ్రైనేజీ నిర్మాణాలతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మాజిద్, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ జాఫర్ షరీఫ్, ఉపాధ్యక్షులు సుల్తాన్, గోవిందరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నోముల రాజు, కొండ శ్రీను, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సోడ మహేష్, అజామ్, ఫయాజ్ పాల్గొన్నారు.



హైదరాబాద్ రోడ్డుపై నిలిచిన నీటిలో అర్ధనగ్న నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఎంపీ బాపురావు వ్యాఖ్యలు దుర్మార్గం

జనగామ రూరల్ : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీరా స్వామినాయక్ అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్వామినాయక్ మాట్లాడారు. తెలంగాణలోని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ హోం శాఖ మంత్రికి, గిరిజన శాఖ మంత్రికి ఎంపీ బాపురావు వినతిపత్రం ఇవ్వడం గిరిజనులను అవమానించడమే అన్నారు. ఇప్పటికే రిజర్వేషన్ ఫలాలు అందక లంబాడీలు అన్ని రంగాల్లో నష్టపోతున్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ స్వార్థంతో కులాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించడం ఎంపీ బాపురావుకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. బాపురావు ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటు బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత, ఏబీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వాసునాయక్, ప్రధాన కార్యదర్శి హరిలాల్, నాయకులు నరేష్, రాజేందర్, ధర్మభిక్షం, తదితతరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న స్వామినాయక్, నాయకులు

సీఐ ఔదార్యం.. పోలీసుల చేయూత

కొడకండ్ల : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కోక సోమయ్య ఇల్లు భారీ వర్షాలకు కూలిపోగా అతడికి పోలీసులు చేయూత అందించారు. సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో సోమయ్యకు కొడకండ్ల, పాలకుర్తి ఎస్సైలు శ్రవణ్, తాళ్ల శ్రీకాంత్, రమేష్‌నాయక్ శుక్రవారం రూ.5 వేలు విలువైన నగదు, బియ్యం, సామగ్రి సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇల్లు కూలిపోయిన సోమయ్యకు నగదు, సామగ్రి అందజేస్తున్న సీఐ విశ్వేశ్వర్

పీరీల ఊరేగింపు

స్టేషన్‌ఘన్‌పూర్ : మొహర్రం పండుగను పురస్కరించుకుని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామాల్లో శుక్రవారం పీరీలను ఊరేగించారు. ముస్లిములు భక్తిశ్రద్ధలతో పీరీలను ఎత్తుకుని డప్పు చప్పుళ్ళ మధ్య ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. పలువురు వారి ఇళ్ల ముందుకు వచ్చిన పీరీలను మొక్కుతూ కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో బోనగిరి విద్యాసాగర్, గోరంతల రాజు పాల్గొన్నారు.

